క్లుప్తంగా

సులభరీతిలో పాఠ్యాంశాల బోధన

సోమల: విద్యార్థులకు అర్థమయ్యే విధంగా సులభ రీతిలో పాఠ్యాంశాలు బోధించాలని ఎంఈఓ కేశవపిళ్లై తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని వడ్డించాలని నిర్వాహకులను ఆదేశించారు. రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు.

ఆర్బీకేల్లో రైతు భరోసా అర్హుల జాబితా

సోమల: మండలంలోని 13 ఆర్బీకేల్లో మూడవ విడత రైతు భరోసా అర్హుల జాబితాను ప్రదర్శించినట్లు ఏఓ సుధాకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని 81 చిన్న ఉప్పరపల్లెలో రైతుల జాబితాను ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తమ పేర్లను పరిశీలించుకుని ఏవైన అభ్యంతరాలు ఉంటే ఈనెల 26వ లోపు ఆర్బీకేల్లో ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. వీఏఏ కుమార్, వైఎస్సార్‌సీపీ నేత పాచ్చా సాహెబ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

బైరెడ్డిపల్లె : బాల్య వివాహాలను అరికట్టడంలో అంగన్‌వాడీ టీచర్లు కీలకపాత్ర పోషించాలని హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ పేర్కొన్నారు. బైరెడ్డిపల్లె పీహెచ్‌సీలో శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు.

శ్రీవిరూపాక్షి మారెమ్మకు నవధాన్యాల అలంకారం



పుంగనూరు: పట్టణంలోని శ్రీవిరూపాక్షి మారెమ్మ ఆలయంలో శుక్రవారం రాహుకాల పూజలు నిర్వహించి, అమ్మవారిని నవధాన్యాలు, పరిమళభరిత పుష్పమాలికలతో అలంకరించారు. వేకువజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో హాజరై, చలిపిండి, చల్లముద్దతో దీపాలు వెలిగించి, మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

నకిలీ నోట్ల చెలామణి

చౌడేపల్లె: మండలంలో ఐదు, రెండు వందల రూపాయల నకిలీ కరెన్సీ నోట్లు దర్శన మిస్తున్నాయి. కొద్ది రోజులుగా నకిలీ నోట్లు చెలమణిలో ఉన్నట్లు చర్చ జరుగుతోంది. తాజాగా శుక్రవారం స్థానిక బస్టాండు సమీపంలోని ఓదుకాణ యజమాని రూ.500 నకిలీ కరెన్సీ నోటును గుర్తించాడు. దీనిపై ఎస్ఐ రవికుమార్ మాట్లాడుతూ ఎలాంటి ఫిర్యాదులు లేవన్నారు. షాపుల నిర్వాహకులే కాకుండా ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వాహనాల వేలం ఆదాయం రూ.1.31 లక్షలు

శాంతిపురం: వివిధ ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన 8 వాహనాల వేలం ద్వారా రూ.1.31 లక్షల ఆదాయం లభించినట్లు రాళ్లబూదుగూరు ఎస్ఐ మునస్వామి తెలిపారు. శుక్రవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో 7 మోటార్‌సైకిళ్లు, ఒక ఆటోను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ సూపరింటెండెంట్ అయేషాబేగం ఆధ్వర్యంలో వేలం వేసినట్లు చెప్పారు. జీఎస్టీ రూపంలో మరో రూ.23,580 సమకూరిందని తెలిపారు.

28న సైన్స్ దినోత్సవం



పలమనేరు: ఈనెల 28న మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ సైన్సు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎంఈవో లీలారాణి సూచించారు. శుక్రవారం ఎంఈవో కార్యాలయంలో మండలంలోని సీఆర్పీ సెక్రటరీలు, సీఆర్‌పీలకు కార్యక్రమ నిర్వహణపై సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థులు భావి భారత సైంటిస్టులుగా ఎదగాలంటే పాఠశాలలే వేదికలని తెలిపారు. ఉపాధ్యాయులు సైన్స్‌పట్ల పిల్లలకు ఆసక్తిని కలిగించాలని సూచించారు. మండలంలోని పలు ఉన్నత పాఠశాలల ప్రిన్సిపాళ్లు, సైన్స్ టీచర్లు పాల్గొన్నారు.

శాంతియుత గ్రామాలే లక్ష్యం



గ్రామస్తులతో చర్చిస్తున్న ఎంపీపీ యువరాజు

వి.కోట: గ్రామాల్లో చిన్నపాటి సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకుంటే ఎటువంటి ఇబ్బందులు ఉండవని ఎంపీపీ యువరాజు పేర్కొన్నారు. మండలంలోని ఓగు పంచాయతీ ఆళ్లవారిపల్లెలో దేవుడు భూములు, రైతులకు దారి సమస్యపై ఆయన స్పందించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయానికి గ్రామస్తులను పిలిపించి చర్చించి సమస్యను పరిష్కరించారు. అలాగే చింతమాకులపల్లె పంచాయతీ కుదవగడ్డ గ్రామానికి చెందిన కొందరు రైతులు పొలాలకు వెళ్లడానికి దారి సమస్య ఉందని విన్నవించారు. వెంటనే రెవెన్యూ అధికారులతో ఎంపీపీ ఆగ్రామ పొలాల వద్దకు చేరుకున్నారు. గ్రామస్తులతో చర్చించి సమస్యను పరిష్కరించేలా చేస్తామని హామీ ఇచ్చారు.

అభివృద్ధికి దారి..

చౌడేపల్లె–పలమనేరు రహదారిలో అడుగువేయలేని ..బండి నడపలేని అవస్థలు పడుతున్న వాహనదారులు, రైతులు, ప్రజల గతి మారనుంది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిల చొరవతో రూ.17.60 కోట్లతో సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా నిర్మిస్తున్నారు. పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే చౌడేపల్లె, సోమల, సదుం మండలాల నుంచి పలమనేరుకు వాహనాల వేగం పెరగడంతోపాటు ప్రయాణం సులభతరం కానుంది. దశాబ్దం కల సాకారం కానుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- రూ.17.60 కోట్లతో చౌడేపల్లె–పలమనేరు రహదారి అభివృద్ధి
- 8 కిలోమీటర్ల మేరకు డబుల్ రోడ్డు
- తీరనున్న గ్రామీణుల దశాబ్దం కల
- మండల అభివృద్ధిపై మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ప్రత్యేక దృష్టి



చౌడేపల్లె- పలమనేరు మార్గంలో చిట్రెడ్డిపల్లె వద్ద డబుల్ రోడ్డు

చౌడేపల్లె: చౌడపల్లె- పలమనేరు రహదారి కష్టాలు త్వరలో తీరనున్నాయి. పెద్దపంజాణి మండల సరిహద్దు ప్రాంతమైన పాత వీరప్పల్లె నుంచి చౌడేపల్లె వరకు 8 కిలోమీటర్లు సింగిల్ తారురోడ్డు ఉండేది. సుమారు 15 ఏళ్ల కిందట నిర్మించిన ఈ రోడ్డు గుంతలతోపాటు ఇరువైపులా కోత గురై ప్రమాదకరంగా ఉండేది. తరచూ టమాటాలు, కోళ్లను తరలించే వాహనాలు, ప్రయాణికులను తరలించే ఆటోలు, చెరకు లోడ్ ట్రాక్టర్‌లు సింగిల్ రోడ్డులో ఎదురుగా వస్తున్న వాహనాలకు దారి ఇవ్వబోయి బోల్తాకొట్టిన సంఘటనలు చాలా ఉన్నాయి. ఈ మార్గంలో మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి స్వగ్రామం కెళవాతి ఉంది. మంత్రిగా అమరనాథ్‌రెడ్డి ఉన్నప్పుడు పలమనేరు నియోజకవర్గం పరిధి ప్రాంతం వరకు డబుల్‌రోడ్డు ఏర్పాటు చేసి పనులను ఆపేశారు. పాత వీరప్పల్లె నుంచి చౌడేపల్లె వరకు 8 కిలోమీటర్ల మేరకు రోడ్డు సక్రమంగా లేకపోవడం, గుంతలు, సింగిల్ రోడ్డు కారణంగా పలమనేరుకు వెళ్లేందుకు గ్రామీణులు ఇబ్బందులు పడుతున్నారు. అనంతరాయుని చెరువు కట్టపై ఇరుకుగా ఉండేది. ఒక్క వాహనం వెళ్లేందుకే కష్టంగా ఉండేది. ప్రస్తుతం కట్టను వెడల్పు చేసి సువిశాలంగా సుందరంగా రోడ్డును ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో జరిగిన ప్రమాదాల్లో పలువురు మృతి చెందగా, కొందరు వికలాంగులైయ్యారు. నిత్యం ఈ మార్గం ప్రమాదాలకు కేరాఫ్‌గా ఉండేది. స్పందించిన మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి రోడ్డు నిర్మాణానికి చొరవ చూపించారు. నిధులు మంజూరు కావడంతో పనులు పూర్తికావచ్చాయి. డబుల్ రోడ్డును మంజూరు చేయించి పనులు పూర్తి చేయించడంతో పరిసర ప్రాంతాల ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

డబుల్ రోడ్డు పనులు ఇలా

మంజూరైన నిధులు	: 17.60 కోట్లు
నిధులు మంజూరైన స్కీమ్ (మేజర్ డిస్ట్రిక్ రోడ్డు)	: ఎంటీఆర్
అభివృద్ధి చేసిన రోడ్డు దూరం	: 8 కిలోమీటర్లు
పైప్‌ల ద్వారా కల్వర్టులు	: 26
మైనర్ బ్రిడ్జి	: ఒకటి
ప్రొటక్షన్ వాల్స్	: 650 మీటర్లు
సీసీరోడ్లు	: 2 కిలోమీటర్లు
మురుగునీటి కాలువలు	: 1800 మీటర్లు
రోడ్డు మార్గంలో ఉన్న గ్రామాలు	: 20



అనంతరాయుని చెర్వు కట్టపై ఇరుకు రోడ్డు



చెరువు కట్టపై విశాలంగా ఏర్పాటు చేసిన రోడ్డు



చారాల వద్ద గోతుల మయంగా రోడ్డు



చారాల వద్ద డబుల్ రోడ్డు

ప్రతి పల్లెకూ రోడ్డుసౌకర్యం



పుంగనూరు నియోజకవర్గంలోని ప్రతి పల్లెకూ తారు రోడ్డు సౌకర్యం కల్పించడమే ధ్యేయం. చౌడేపల్లె- పలమనేరు మార్గం, చౌడేపల్లె మీదుగా బోయకొండ వయా మదనపల్లె, దాదేపల్లె క్రాస్ నుంచివయా ఏ.కొత్తకోట మీదుగా పుంగనూరు వరకు గతంలో సింగిల్ రోడ్డు ఉండేది. ప్రస్తుతం రూ. 89.20 కోట్లతో డబుల్ రోడ్డు పనులు పూర్తి చేశాం. ప్రతి పల్లెకు రోడ్డు సౌకర్యంతోపాటు వీధుల్లో సిమెంటు రోడ్డు ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలుపుతున్నాం. **- పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అటవీ, విద్యుత్‌శాఖ మంత్రి**

సమస్యలపై సత్వరమే స్పందించాలి



సూచనలిస్తున్న జెడ్పీ చైర్మెన్ శ్రీనివాసులు

వి.కోట: సచివాలయాల్లో వచ్చిన ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని జెడ్పీ చైర్మెన్ శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం మండలంలోని ఎస్ బండపల్లె సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, మూమెంట్, సీఎల్ రిజిస్టర్లు, స్పందన, సర్వీస్ రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోజూ సచివాలయాల్లో విధిగా స్పందన నిర్వహించాలని, వచ్చిన అర్జీలపై విచారించి వెంటనే పరిష్కరించాలని తెలిపారు. గ్రామాల్లో తాగు నీటి సమస్య తెలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గోశాలకు పుంగనూరు జాతి గోవు



గోవును చైర్మన్,ఈఓకు అప్పగిస్తున్న దాత జీవన్ ప్రకాష్

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయ గోశాలకు పుంగనూరు జాతికి చెందిన ఆవును శుక్రవారం చౌడేపల్లెకు చెందిన పిల్లారి జీవన్ ప్రకాష్ కానుకగా అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మిద్దెంటి శంకర్ నారాయణ, ఆలయ ఈఓ చంద్రమౌళి మాట్లాడుతూ ఆవు విలువ రూ. 1.50 లక్ష ఉంటుందని తెలిపారు. దాతకు అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించి, జ్ఞాపికను అందజేశారు. ఆయన వెంట కాపునాడు యూత్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెంటి కిషోర్, పాలక మండలి సభ్యురాలు పూర్ణిమ , ఏఎంసీ మాజీ డైరెక్టర్ రాజేష్, నేతలు మంజునాథ్, లీలాకుమార్‌నాగ్, వెంకటేష్‌రాజు తదితరులున్నారు.

పెద్దిరెడ్డిని కలిసిన ఎస్సీసెల్ అధ్యక్షుడు



సదుం: పెద్దిరెడ్డితో ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటస్వామి

సదుం: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగం చిత్తూరు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటస్వామి శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. వెంకటస్వామి మాట్లాడుతూ..తన నియామకానికి కృషి చేసిన మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ వెంకటస్వామి, సచివాలలయాల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, ఎల్లారెడ్డి, ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

రాహుకాల పూజలకు పోటెత్తిన భక్తులు



ఆలయంలో రద్దీ, (ఇన్‌సెట్) విశేషాలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం రాహుకాల అభిషేక పూజలకు భక్తులు పోటెత్తారు. ఉదయం 10–30 నుంచి 12 గంటల వరకు పూజలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చినమహిళలు ఆలయానికి వచ్చి పూజల్లో పాల్గొన్నారు. వేకువజామున అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేశారు. రాహుకాల సమ యంలో వేదపండితులు గోవర్దనశర్మ, అర్చకులు గంగిరెడ్డి, సుధాకర్, రాజన్న బృందం పూజలు చేశారు.

వడ్డెరులకు చంద్రబాబు చేసింది శూన్యం



మాట్లాడుతున్న వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దన్న

కుప్పం: కుప్పానికి 35 ఏళ్లుగా ప్రతినిథ్యం వహిస్తున్నా నియోజకవర్గంలో అధికంగా ఉన్న వడ్డెర సామాజిక వర్గానికి చంద్రబాబునాయుడు చేసింది శూన్యమని వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దన్న తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సామాజిక వర్గానికి కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి పదవులు ఇచ్చి అధిక ప్రాధాన్యత ఇచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలను వడ్డెర సామాజిక వర్గానికి కేటాయించడం చరిత్రల్లోనే ప్రథమన్నారు. సంఘ నాయకులు వినాయక్, రవి, వీరభద్ర, వెంకటస్వామి, మణి, మురుగేష్, శ్రీనివాసులు, గజేంద్ర, రెడ్డెప్ప పాల్గొన్నారు.

ఇంటర్ మానేసిన వారికి మరో చాన్స్

సోమల: ఇంటర్ చదువుతూ మధ్యలో మానేసిన వారు కోర్సు పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని స్థానిక ఎస్‌కేవీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధరం నాయుడు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఓపెన్ ఇంటర్ గురించి వివరించారు. ప్రస్తుత సంవత్సరం సెకండ్ ఇయర్ ఇంటర్‌లో కళాశాలకు వెళ్లకుండా మధ్యలో మానేసిన విద్యార్థులందరూ ఈనెల 27వ తేదీ లోపు కళాశాలలో పరీక్షలకు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం

పులిచెర్ల(కల్లూరు): విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ సిద్ధరామయ్య తెలిపారు. శుక్రవారం కల్లూరు ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును తనిఖీ చేశారు..

నేడు సత్కారం

శాంతిపురం: వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల్లో నూతనంగా పదవులు పొందిన వారిని శనివారం సత్కరించనున్నట్లు మండల కన్వీనర్ దండపాణి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

నేడు మండల సమావేశం

పలమనేరు: మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రోజా అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో విద్యాసాగర్ ఓ ప్రకటనలో తెలిపారు.

రామకుప్పం: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ సుబ్రమణ్యం అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధాకృష్ణ తెలిపారు.

బాలుడికి పాముకాటు



చికిత్స పొందుతున్న బాలుడు

రామకుప్పం: మండలంలోని యానాదికాలనీకి చెందిన రమేష్ కుమారుడు బోయకొండ(8) శుక్రవారం పాముకాటుకు గురయ్యాడు. ఇంటి వద్ద ఆడుకుంటుండగా పాము కాటు వేయడంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం రామకుప్పం పీహెచ్‌సీకి తీరలించారు. వైద్యాధికారి లోకేష్ ప్రథమ చికిత్స అందించి, మైరుగైన చికిత్స కోసం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆయన తెలిపారు.

శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సోమల: పట్టభద్రుల ఎమ్మెల్సీఅభ్యర్థి పెర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గంగాధరం ఆధ్వర్యంలో మండలంలోని అన్నెమ్మగారిపల్లె, పేటూరు, పెద్ద ఉప్పరపల్లె, ఆవులపల్లె పంచాయతీల్లో పట్టభద్రులను కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. వైస్ ఎంపీపీ ప్రభాకర, సచివాలయాల మండల కన్వీనర్ రాశెట్టి మధు, నేతలు రమణారెడ్డి, మనురాయల్, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు మూడు మండలాల్లో విద్యుత్‌కు అంతరాయం

పలమనేరు: నియోజకవర్గంలోని గంగవరం, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లె మండలాల్లో శనివారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం మూడు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏడీ చిన్నబ్బ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్ల మరమ్మతుల కారణంగా అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

రూ.66 కోట్లతో మున్సిపాలిటీ అభివృద్ధి



వార్డు ప్రజలతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సుధీర్

కుప్పంరూరల్: కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.66 కోట్లు కేటాయించారని, అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామని చైర్మన్ డాక్టర్ సుధీర్ తెలిపారు.మున్సిపల్ పరిధిలోని సమస్యలను పరిష్కరించేందుకే వార్డు బాట చేపడుతున్నట్లు చెప్పారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని రాజీవ్‌కాలనీ, వడ్డిపల్లె గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. స్థానికులు విన్నవించిన సమస్యలను వెంటే ఉన్న కమిషనర్ రవిరెడ్డితో చర్చించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీ కావడంతో పూర్తిస్థాయి సమస్యల పరిష్కారానికి కొంత సమయం పడుతుందని, ప్రాధాన్యతల వారీగా అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. జరుగుతున్న పనుల్లో ఎక్కడా నాణ్యతా లోపం ఉండకూడదని అధికారులను ఆదేశించారు.

వైభవంగా శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రత్యేకాలంకరణలో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి

సోమల: మండలంలోని పెద్ద ఉప్పరపల్లెలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీరుక్మిణి, సత్యభామ సమేత శ్రీ కృష్ణ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో తిరు కల్యాణోత్సవం, ఉత్సవమూర్తుల ఊరేగింపు, అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకట్‌రెడ్డి యాదవ్, సింగిల్ విండో వైస్ చైర్మన్ గణపతి, సర్పంచ్ భారతి, వైఎస్సార్‌సీపీ నేత రాంపల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులకు క్రమశిక్షణ అవసరం



మాట్లాడుతున్న కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి

పుంగనూరు: సచివాలయ కార్యదర్శులు విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటించకుంటే లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని 10, 11, 12, 4 సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాయాల్లో ఉద్యోగుల హాజరుపట్టి, సమస్యల నమోదు, తదితర విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులు యూనిఫాం లేకుండా విధులకు హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనిఫాం కచ్చితంగా ధరించి, సమస్యలపై వచ్చే వారితో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని తెలిపారు. పథకాల లబ్ధిదారులు, అర్హులు, అనర్హుల జాబితాలను ప్రదర్శించాలని ఆదేశించారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి

చౌడేపల్లె: అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఆయన అధికారులు, ప్రజాప్రతి నిధులు, కాంట్రాక్టర్‌లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని పల్లెల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి తాగునీటి కొళాయిలు ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని తెలిపారు. జెడ్పిటీసీ సభ్యుడు దామోదరరాజు, మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారం, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రెడ్డిప్రకాష్, పాల ఏకరి కార్పొరేషన్ డైరెక్టర్ లడ్డూరమణ, ఎంపీడీఓ సుధాకర్, తహశీల్దార్ మాధవరాజు తదితరులున్నారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి



రొంపిచెర్ల: వినతిపత్రం అందించేందుకు వచ్చిన ముస్లింలు

రొంపిచెర్ల: మసీదు మాన్యం ఆక్రమణలు తొలగించాలని చిన్న మసీదు వీధికి చెందిన ముస్లిం మైనారిటీలు శుక్రవారం డీటీ వెంకటరమణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. మండంలోని చిన్నమసీదు మాన్యం ఆక్రమణలకు గురయ్యిందని, కొందరు భూములు విక్రయించడానికి ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చర్యలు తీసుకోవాలని కోరారు. హుస్సేన్ సాహెబ్ తన భూమిలో సర్వే నెంబర్లు 972/2లో 0.07 సెంట్లు, 978లో0.03 1/2 సెంట్లు, 979 లో 0.04 1/2 సెంట్లు, 1639/1లో 0.048 సెంట్లు, 1640–1లో 0.64 సెంట్లు, పెద్దమల్లెల రెవెన్యూ గ్రామంలో 1584–2లో0.30 సెంట్లు మసీదుకు రాసి ఇచ్చారని, దీన్ని పలు కార్యక్రమాలకు ఉపయోగించేలా చూడాలని కోరారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీటీ హామీ ఇచ్చారు.

గ్రామాలను కుదించారని బస్సు అడ్డగింత



పెద్దమల్లెల వద్ద బస్సును అడ్డుకున్న గ్రామస్తులు

రొంపిచెర్ల: తమ గ్రామాల వద్ద ఆపకుండా వెళుతున్న పీలేరు–రొంపిచెర్ల ఆర్టీసీ బస్సును పలు గ్రామాల ప్రజలు శుక్రవారం అడ్డుకున్నారు. పెద్దమల్లెల–రొంపిచెర్ల మార్గంలోఉన్న గ్రామాలను కుదించి బస్సు సర్వీసును నడపడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలు.. పీలేరు- వయా పెద్దమల్లెల మీదుగా రొంపిచెర్లకు ఆర్టీసీ బస్సు సర్వీసు నడుస్తుంది. గత నెలలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పల్లెబాట కార్యక్రమంలో ప్రజల విజ్ఞప్తి మేరకు గూండ్లకాడపల్లె, బందార్లపల్లె, వడ్డేవాండ్లపల్లె, దళితవాడ, కొత్తపల్లె గ్రామాల మీదుగా పీలేరు–రొంపిచెర్ల బస్సు నడపాలని మంత్రి ఆదేశించారు. అప్పటి నుంచి అన్ని గ్రామాలను కలుపుతూ బస్సు నడుస్తుంది. పలు గ్రామాల మీదుగా బస్సు నడుస్తుండడంతో అలస్యం అవుతుందని, ముందు నడుస్తున్న విధంగానే నడపాలని నడింపల్లె, జాండ్లవారిపల్లె, మల్లెలకాస్త గ్రామస్తులు బస్సు డ్రైవర్, కండెక్టర్‌పై ఒత్తిడి తెచ్చారు. గురువారం అన్ని పల్లెల వద్ద బస్సు ఆగకుండా వెళ్లింది. దీనిపై శుక్రవారం మిగిలిన గ్రామాలకు చెందిన గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పీలేరు, రొంపిచెర్లకు పాఠశాలలకు, కళాశాలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారని ఆయా గ్రామస్తులు శుక్రవారం బస్సును అడ్డుకున్నారు. సంఘటన స్థలానికి పీలేరు ఆర్టీసీ డీఎం కుమార్, రొంపిచెర్ల పోలీసులు వెళ్లి గ్రామస్తులతో చర్చలు జరిపారు. ఇరువర్గాల వారు ఒప్పుకోక పోవడంతో వారం రోజుల పాటు బస్సు సర్వీసును పూర్తిగా రద్దు చేస్తున్నట్లు డీఎం తెలిపారు. అన్ని గ్రామాల వారు కలసి నిర్ణయం తీసుకుంటే బస్సు సర్వీసు నడుపుతామని స్పష్టం చేశారు.